
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం, 30, అక్టోబర్, 2023



సోమశిలలో 30.146 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో ఆదివారం సాయంత్రానికి 30.146 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 97 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.63,500
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,734
3శాతం జీఎస్టీతో	రూ.5,906
నవర (8గ్రా)	రూ.47,248

గరిష్టం/కనిష్టం
35.0 /26.4

వాతావరణం

ఆదివారం గాలిలో తేమ 79 శాతం ఉంది. సోమవారం ఉష్ణోగ్రతలు, ఎండతీవ్రత సాధారణంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఎంజీఆర్ విగ్రహావిష్కరణ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి కాకాణి, మాజీ ఎంపీ రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని నవంబర్ 2వ తేదీన నెల్లూరులోని డైకస్ రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేయనున్న ఆయన కాంస్య విగ్రహ ఏర్పాట్లను ఆదివారం రాత్రి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పరిశీలించారు. గౌతమ్‌రెడ్డి విగ్రహావిష్కరణ జరగనున్న నేపథ్యంలో పలు అంశాలపై చర్చించారు.

మూడు యూనిట్లలో విద్యుదుత్పత్తి

ముత్తుకూరు: మండలంలోని నేలటూరులో ఉన్న శ్రీదామోదరం సంజీవయ్య ఏపీజెన్‌కో ప్రాజెక్ట్‌లో మూడు యూనిట్ల నుంచి విద్యుదుత్పత్తి జరుగుతోందని ప్రాజెక్ట్ ఇంజినీర్లు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా 1వ యూనిట్‌లో 410 మెగావాట్లు, 2వ యూనిట్‌లో 410 మెగావాట్లు, 3వ యూనిట్‌లో 610 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోందని తెలిపారు.

భారీ నౌకల్లో బొగ్గు దిగుమతి

ముత్తుకూరు: అదానీ కృష్ణపట్నం పోర్టులో భారీ నౌకల ద్వారా బొగ్గు దిగుమతి జరుగుతోందని పోర్టు ఉన్నతోద్యోగి ఒకరు ఆదివారం తెలిపారు. ఇందులో భాగంగా కాప్రికార్న్ ఒన్ అనే నౌక ద్వారా 1.27 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి చేస్తున్నారు. అలాగే, సీపీసీ పవోలా అనే నౌక నుంచి 1.65 లక్షల టన్నుల బొగ్గు దిగుమతి జరుగుతోంది.

హైస్కూల్ ప్లస్‌లో బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(టౌన్): హైస్కూల్ ప్లస్ (బాలికలు) పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో బోధించేందుకు సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు డీఈఓ గంగాభవాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 30వ తేదీ నుంచి నవంబర్ 1వ తేదీ లోపు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మాత్రమే బోధించేందుకు అర్హులని తెలిపారు. పోస్టుల ఖాళీలను డీఈఓ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ తేదీలను తర్వాత తెలియజేస్తామని తెలిపారు.

ఓపెన్ స్కూల్ తరగతుల పరిశీలన

నెల్లూరు రూరల్: నగరంలోని మూలాపేట ఈఎస్ఆర్ఎం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ తరగతులను ఆదివారం ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ గుంటూరు కార్యాలయం సూపరింటెండెంట్ జేవీ నాగేంద్ర, నెల్లూరు పరీక్షల నిర్వహణ అసిస్టెంట్ కమిషనర్ పి.రామారావు పరిశీలించారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి

చిల్లకూరు: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని, అవి మన దేశంలో వర్ధిల్లాలంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న గ్రామదేవతలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇచ్చాపురంలోని నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి స్వామి తెలిపారు. చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆయన ఆదివారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో 'దేవతా మహత్యం – జగన్మాత తత్వం' అనే అంశంపై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమకు దగ్గరలో ఉన్న గ్రామదేవతలను దర్శించుకోవాలని సూచించారు. కొన్ని ప్రాంతాల్లో నేటికీ ఆనవాయితీని కొనసాగిస్తున్నారని, తద్వారా సంస్కృతి, సంప్రదాయాలు నిలిచి ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అతివలకు అండ.. దిశ



జిల్లాలో..

- రిజిస్ట్రేషన్లు - 7,97,219
- ఎస్‌ఓఎస్‌కు వచ్చిన కాల్స్ - 2,790
- ఎఫ్ఐఆర్‌లు నమోదు - 70
- మిగిలిన కాల్స్‌కు సంబంధించి -సమస్యలు పరిష్కారం
- పోలీసుల రెస్పాన్స్ టైమ్
- పట్టణ ప్రాంతాల్లో.. - 5 నుంచి 7 నిమిషాలు
- గ్రామీణ ప్రాంతాల్లో - దూరాన్ని బట్టి..

ఇలాంటి ఘటనలు ఎన్నో..

ఈ ఏడాది జూన్ 6వ తేదీ రాత్రి కందుకూరుకు చెందిన ఓ మహిళ ఊరికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చారు. అప్పటికే బస్సు వెళ్లిపోవడంతో నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో కందుకూరుకు చెందిన కొందరు యువకులు ఆమె పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో కేకలు వేసింది. గమనించిన ఓ వ్యక్తి దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బాధిత మహిళను సురక్షితంగా ఇంటి వద్ద వదిలిపెట్టారు.

జూన్ 26వ తేదీన ప్రకాశం జిల్లాకు చెందిన ఓ యువతి ఇంట్లో నుంచి అలిగి నెల్లూరుకు వచ్చింది. ఆర్టీసీ బస్టాండ్‌లో తిరుగుతుండగా అక్కడి వారు దిశ ఎస్‌ఓఎస్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించారు. చిన్నబజారు పోలీసులు బస్టాండ్‌కు చేరుకుని యువతిని విచారించారు. ఆమెను సఖి పోలీసుల ద్వారా బాధిత తల్లిదండ్రులకు అప్పగించారు.

రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మహిళల భద్రతకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోంది. అసెంబ్లీలో దిశ చట్టం ఆమోదించింది. మహిళలపై నేరాల విచారణకు పలు జిల్లాల్లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసింది. దీంతోపాటు ఆపదలో ఉన్న మహిళల్ని ఆదుకునేందుకు దిశ యాప్‌ను ప్రారంభించింది. ఇది మహిళలకు రక్షణ కవచంలా నిలుస్తోంది.

- యాప్ డౌన్‌లోడ్ చేసుకుని లక్షల మంది రిజిస్ట్రేషన్లు
- బటన్ నొక్కి పోలీసు రక్షణ పొందుతున్న మహిళలు
- జగనన్న భరోసాను మరువలేమంటున్న యువతులు



మొబైల్ ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్‌పై మహిళలకు అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసులు (ఫైల్)

సాక్షి, నెల్లూరు డెస్క్: ఏపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన దిశ యాప్‌నకు మంచి ఆదరణ లభిస్తోంది. 2020 ఫిబ్రవరిలో ప్రారంభమైన దిశ యాప్‌ను ఇప్పటికే లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. దిశ యాప్ ద్వారా వచ్చిన వేలాది ఫోన్‌కాల్స్, మెసేజ్‌లకు సంబంధించి పోలీసులు చర్యలు తీసుకున్నారు. చాలా కేసుల్లో ఎఫ్ఐఆర్ నమోదైంది. పలువురు మహిళలు, అమ్మాయిల్ని ప్రమాదాల బారి నుంచి దిశ యాప్ రక్షించింది.

దిశ యాప్ ప్రయోజనాలు

యువతులు, మహిళలు ఆపదలో ఉన్నప్పుడు పోలీసులతోపాటు ఐదుగురు కుటుంబసభ్యులు లేదా స్నేహితులకు తక్షణం సమాచారం చేరవేసే ఏర్పాటు ఉంటుంది. ప్రయాణ సమయంలో ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ ఉంటుంది. చేరాల్సిన గమ్యస్థానాన్ని నమోదు చేస్తే అనుక్షణం ట్రాకింగ్ చేస్తుంది. వాహనం దారి తప్పితే ఆ సమాచారం వెంటనే దిశ కమాండ్ కంట్రోల్ రూమ్‌తోపాటు బంధుమిత్రులకు చేరవేస్తుంది. దిశ యాప్‌లో 100, 112 వంటి అత్యవసర నంబర్లతోపాటు పోలీస్ స్టేషన్లు, ఆస్పత్రులు, మెటర్నిటీ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు, ట్రామా కేర్ సెంటర్లు, మెడికల్ షాపుల వివరాలు ఉంటాయి. కమాండ్ కంట్రోల్ నుంచి పుష్ బటన్ ఆప్షన్ ద్వారా పోలీసులు ఒకే సమయంలో అందరికీ సలహాలు, సూచనలు ఇస్తారు. విపత్కర పరిస్థితుల్లో సమయం లేకపోతే ఫోన్‌ను గట్టిగా అటూ ఇటూ ఊపితే చాలు.. పోలీసులకు సందేశం చేరిపోతుంది. అప్రమత్తమైన పోలీసులు కాల్ బ్యాక్ చేస్తారు. ఫోన్‌కు స్పందించకపోతే పోలీసు వాహనంలో ఉన్న మొబైల్ డేటా టెర్మినల్ సహాయంతో జీపీఎస్ ట్రాకింగ్ ద్వారా బాధితులు ఉన్న లొకేషన్‌కు పోలీసులు చేరుకుంటారు.

యాప్ డౌన్‌లోడ్ ఇలా..

ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లలో దిశ యాప్‌డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. డౌన్‌లోడ్ పూర్తయ్యాక మొబైల్ నంబర్ ఎంటర్ చేస్తే ఓటీపీ వస్తుంది. ఓటీపీ ఎంటర్ చేసి.. పేరు, మొబైల్ నంబర్, అడ్రస్, ప్రత్యామ్నాయ నంబర్, అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన కాంటాక్ట్ నంబర్లు వంటి వివరాల్ని నమోదు చేయాలి. ఆపదలో ఉన్నప్పుడు దిశ యాప్‌లో ఉన్న ఎస్ఓఎస్ బటన్ నొక్కితే ఫోన్ నంబర్, చిరునామా, లొకేషన్‌తో సహా వాయిస్ 10 సెకన్లు రికార్డు చేసి దిశ కమాండ్ కంట్రోల్ రూమ్‌కు పంపేలా ఏర్పాటుంది.

నెట్ లేకపోయినా ఓకే

దిశ ఎస్ఓఎస్ యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఇన్‌స్టాల్ సమయంలో మాత్రమే నెట్ అవసరం. ఆ తర్వాత నెట్ లేకపోయినప్పటికీ యాప్ పనిచేస్తుంది. వ్యక్తిగత వివరాలతోపాటు కుటుంబసభ్యులు, స్నేహితులకు సంబంధించిన ఐదు ఫోన్‌నంబర్లను అందులో సేవ్ చేసుకోవాలి. ఆపదలో ఉన్నప్పుడు యాప్‌ను ఓపెన్ చేసి అత్యవసర సహాయం(ఎస్ఓఎస్) బటన్ నొక్కాలి. బటన్ నొక్కే పరిస్థితి లేకపోతే ఫోన్‌ను వేగంగా అటూ ఇటూ ఊపితే ఫోన్ లొకేషన్ వివరాలు కంట్రోల్ రూమ్‌కు వెళ్తాయి. అదే క్రమంలో ఎస్ఓఎస్ బటన్ నొక్కి ఆమె వాయిస్‌తో పాటు అక్కడ జరిగే దృశ్యాలను 10 సెకన్ల నిడివి వరకు వీడియో తీసి పంపవచ్చు. దీంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని చర్యలు చేపడుతారు.

ఆపద సమయంలో ఆపన్నహస్తం



ఎవరికి ఏ సమయంలో ఆపద వస్తుందో తెలియదు. నాకేం కాదని అనుకోవడం సరికాదు. ప్రతి మహిళ తన స్మార్ట్‌ఫోన్‌లో దిశ యాప్‌ను విధిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆపద సమయంలో యాప్ ఆపన్నహస్తంలా పనిచేస్తుంది. ఆపదలో ఎస్ఓఎస్ బటన్ నొక్కినా, ఫోన్‌ను అటూ ఇటూ ఊపినా నిమిషాల వ్యవధిలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రక్షిస్తారు.

– డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి, ఎస్పీ

దిశతో భద్రత కలిగింది



మహిళల రక్షణకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారు. అందులో భాగంగా మహిళల కోసం రూపొందించిన దిశ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంది. యాప్ ఆపద సమయంలో అండగా ఉంటోంది. ప్రధానంగా ట్రాక్ మై ట్రావెల్ ఆప్షన్ ద్వారా మనం ఎక్కడికి వెళుతున్నాం అన్నది మన కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఉంటుంది. మనం భయపడాల్సిన అవసరం లేదు.

– కె.శ్రీవల్లి, విద్యార్థిని

తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి



మహిళల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై తల్లిదండ్రులు పూర్తి అవగాహన కలిగి ఉండాలి. పిల్లలకు సెల్‌ఫోన్లు కొనివ్వడంతోనే సరిపెట్టుకోకుండా మహిళల భద్రత కోసం అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన దిశ యాప్‌ను విధిగా వారి సెల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేయించాలి. ఆపద సమయంలో యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలో వారికి వివరించాలి.

– కె.మెర్సీ, ఉపాధ్యాయురాలు

పోలీసుల త్యాగాలను స్మరించుకుందాం

- ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణలో పోలీసుల త్యాగాలను ప్రతీ ఒక్కరూ స్మరించుకోవాలని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా పోలీసుల త్యాగాలపై ఆదివారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా తొలుత గుర్తొచ్చేది పోలీసులేనన్నారు. పోలీసు విధి నిర్వహణ కత్తి మీద సాములాంటిదని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎందరో పోలీసులు ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరిగిన బలిమెల దుర్ఘటన లాంటి ఘటనలు మనసును కలిచివేస్తాయన్నారు. యువత పోలీసుశాఖ వైపు ఆసక్తి చూపాలని సూచించారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ యువత ప్రేమ పేరిట మోసపోవద్దని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికీ ఇవ్వరాదని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు డి.హిమవతి, ప్రసాద్, నగర, రూరల్, ట్రాఫిక్, డీటీసీ డీఎస్పీలు డి.శ్రీనివాసరెడ్డి, పి.వీరాంజనేయరెడ్డి, అబ్దుల్ సుభాన్, శిరీష, వక్తలు నరసింహారెడ్డి, శ్రీధర్, నగర ఇన్‌స్పెక్టర్లు అశోక్‌కుమార్, బాబీ, కల్యాణ్‌రాజు, సుబ్బారావు, పి.వి.నారాయణ, రాములునాయక్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, పీఆర్ఓ డి.వెంకటేశ్వరరావు, ఎస్సైలు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పాల్గొన్న పోలీసు అధికారులు, విద్యార్థులు

నేడు సామాజిక సాధికార బస్సు యాత్ర

- వింజమూరు నుంచి ప్రారంభం
- వింజమూరు, ఉదయగిరిలలో బహిరంగ సభలు
- జాగీరువనం వద్ద ముఖ్యనేతలతో ఆత్మీయ సమావేశం

ఉదయగిరి: ఉదయగిరి నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర సోమవారం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం వింజమూరులో విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 9.30 గంటలకు వింజమూరులోని చెన్నకేశవస్వామి ఆలయం నుంచి యాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.

యాత్ర ఇలా..

వింజమూరులోని బంగ్లా సెంటర్ వద్ద బహిరంగసభ నిర్వహిస్తారు. అనంతరం వింజమూరు నుంచి దుత్తలూరుకు వెళ్లే రోడ్డు మార్గంలో జాగీరువనం వద్ద ముఖ్యమైన నేతలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారు. అక్కడే విలేకరుల సమావేశం ఉంటుంది. ముఖ్యమైన నేతలకు భోజన వసతి కూడా ఇక్కడే ఏర్పాటు చేస్తున్నారు. అక్కడి నుంచి యాత్ర ప్రారంభమై మధ్యాహ్నం 1.15 గంటలకు దుత్తలూరుకు చేరుకుంటుంది. దుత్తలూరు నుంచి ఉదయగిరి వరకు కార్లు, బైక్ ర్యాలీతో యాత్ర ఉదయగిరి ఏబీఎం చర్చి వరకు కొనసాగుతుంది. అక్కడి నుంచి ట్యాంక్‌బండ్, ఉదయగిరి పట్టణం మీదుగా బహిరంగసభ జరిగే ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్లేగ్రౌండ్ వరకు పాదయాత్ర సాగుతుంది. ఈ యాత్రలో ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, నెల్లూరు నగర మేయర్ స్రవంతి తదితర ముఖ్యనేతలు పాల్గొని బహిరంగ సభలో ప్రసంగిస్తారు. ఈ యాత్రలో నియోజకవర్గంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఇతర వర్గాల పేదలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాజగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు.

పేదల ఇళ్లకు విద్యుత్ వెలుగులు

పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలనూ కల్పిస్తోంది. ఇప్పటికే మంచినీటి వసతి కోసం బోర్లు వేసింది. ప్రస్తుతం జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కోసం నూతన విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసింది. అదేవిధంగా జగనన్న కాలనీల్లోని పేదల ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. లబ్ధిదారుడికి ఖర్చయ్యే రూ.5 వేలను ప్రభుత్వమే భరించనుంది.

- జగనన్న కాలనీల్లో ఇళ్లకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్లు
- మీటరుతోపాటు బోర్డు, సర్వీసు వైర్లు ఉచితమే
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



నెల్లూరులోని జనార్దన్‌రెడ్డి కాలనీ జగనన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు

ఉమ్మడి జిల్లాలో డివిజన్ల వారీగా ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చే ఇళ్ల వివరాలు

డివిజన్ పేరు	లేఅవుట్ల సంఖ్య	ఉచిత విద్యుత్ కనెక్షన్లు సంఖ్య	ఖర్చు చేయనున్న నిధులు
నెల్లూరు టౌన్	5	6,017	రూ.5,00,85,000
నెల్లూరు రూరల్	125	32,241	రూ.16,12,05,000
కావలి	115	25,628	రూ.12,81,40,000
ఆత్మకూరు	5	2,169	రూ.1,08,45,000
గూడూరు	47	8,068	రూ.4,03,40,000
నాయుడుపేట	68	8,432	రూ.4,21,60,000

ఉమ్మడి జిల్లాలో..

- జగనన్న కాలనీల్లోని లేఅవుట్లు - 365
- ఉచిత విద్యుత్ కనెక్షన్లకు ప్రభుత్వం ఖర్చు - రూ.51.28 కోట్లు
- విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల కోసం - రూ.18.36 కోట్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన పేద లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో వరం ప్రకటించింది. విద్యుత్ కనెక్షన్‌తోపాటు మీటర్, సర్వీసు చార్జీలు, మీటరు ఏర్పాటు చేసే బోర్డు, సెక్యూరిటీ డిపాజిట్ లాంటివి విద్యుత్ సంస్థకు చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వమే ఈ ఖర్చును భరించేందుకు సిద్ధమైంది. విద్యుత్ స్తంభం నుంచి మీటర్ బోర్డు వరకు వచ్చే విద్యుత్ వైరును కూడా ప్రభుత్వమే ఉచితంగా ఇవ్వనుంది. ఇప్పటికే జగనన్న కాలనీల్లో అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్లకు రూపాయి ఖర్చు లేకుండా విద్యుత్ కనెక్షన్ ఇచ్చేలా నిర్ణయం తీసుకుంది.

విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు

ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని నెల్లూరు, నెల్లూరు రూరల్, కావలి, ఆత్మకూరు, గూడూరు, నాయుడుపేట డివిజన్లలో పేదల ఇళ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం 365 లేఅవుట్లను వేసి మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఈ లేఅవుట్లలో మంచినీటి సౌకర్యం కోసం 418 బోర్లకు ఇప్పటికే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.4.38 కోట్లు ఖర్చు చేసింది. జగనన్న కాలనీల్లో రూ.5.38 కోట్లతో 8,390 నూతన విద్యుత్ స్తంభాలు, రూ.4.50 కోట్లతో 140 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, రూ.4.10 కోట్లతో 632 కిలోమీటర్ల మేర నూతనంగా విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కోసం మొత్తం రూ.18.36 కోట్లు ఖర్చు చేసింది. తాజాగా జగనన్న కాలనీల్లోని ఇళ్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.51.28 కోట్లు ఖర్చు చేయనుంది.

ఉచిత విద్యుత్ కనెక్షన్లు

జిల్లాలో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న పేదల ఇళ్లకు ఉచిత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేందుకు ఒక్కొక్క ఇంటికి రూ.5 వేలు ఖర్చవుతుంది. ఇందుకు అవసరమైన విద్యుత్ సర్వీసు వైరు, మీటరు, బోర్డును ప్రభుత్వం ఉచితంగా అందించేందుకు మొత్తం రూ.51.28 కోట్లు ఖర్చు చేయనుంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో, మీసేవ కేంద్రాల్లో లబ్ధిదారులు దరఖాస్తు చేసుకుని అందుకు సంబంధించిన రసీదును సంబంధిత విద్యుత్‌శాఖ ఏఈ కార్యాలయంలో అందజేస్తే ఎలాంటి సెక్యూరిటీ డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీలు లేకుండా ఆ శాఖ సిబ్బంది ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వనున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిగా ఉచితం



జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ కనెక్షన్ సౌకర్యం కల్పించింది. తద్వారా లబ్ధిదారులకు ఉచితంగా విద్యుత్ మీటర్, సర్వీసు వైరు, మీటర్ బోర్డు ఉచితంగా ఇవ్వడం జరుగుతుంది. జగనన్న కాలనీల్లోని ఇళ్ల లబ్ధిదారులు విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ సంస్థకు డిపాజిట్, డెవలప్‌మెంట్ చార్జీల రూపంలో ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదు.

– విజయన్, ఎస్ఈ, ఏపీఎస్పీడీసీఎల్

చాలా ఆనందంగా ఉంది



జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకుంటున్న మాలాంటి పేదలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం చాలా ఆనందంగా ఉంది. విద్యుత్ కనెక్షన్ కోసం ఎలాంటి రుసుం చెల్లించకుండా, విద్యుత్ కార్యాలయాలు, అధికారులు, సిబ్బంది చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా ఉచితంగా విద్యుత్ కనెక్షన్ ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– రాజా, లబ్ధిదారుడు, వెంకటేశ్వరపురం

జగనన్నకు రుణపడి ఉంటాం



ఇల్లు లేని మా కుటుంబానికి జగనన్న సొంత ఇల్లు కట్టించి ఇస్తున్నాడు. ఇంటి నిర్మాణానికి ఇప్పటికే రూ.60 వేలు మా బ్యాంక్ ఖాతాలో జమ అయింది. మంచినీటి అవసరాల కోసం మా ప్లాట్ వద్ద బోరు వేసి నీరు అందించారు. అలాగే ఇప్పుడు కరెంట్ కూడా ఉచితంగా ఇస్తానని చెప్పడం చాలా సంతోషంగా ఉంది. జగనన్నకు రుణపడి ఉంటాం. ఈ సాయాన్ని ఎన్నటికీ మరువలేం.

– నన్నేసాహెబ్, జనార్దన్‌రెడ్డికాలనీ, నెల్లూరు

రౌడీమూకలపై సామాజిక వ్యతిరేకత

- ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటన అమానుషమంటూ ప్రజాస్పందన

కావలి: విధుల్లో ఉన్న ఆర్టీసీ డ్రైవర్‌పై అమానుషంగా దాడికి పాల్పడిన రౌడీమూకలకు సామాజిక వ్యతిరేకత పెరుగుతోంది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి రౌడీమూకలపై కఠిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. మరోవైపు ఆర్టీసీ ఎండీ సైతం ఈ ఘటనను సీరియస్‌గా తీసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పోలీసులు సైతం రంగంలోకి దిగారు. ఇదే సమయంలో డ్రైవర్‌పై దాడి ఘటనను న్యాయవాదులు సైతం వ్యతిరేకించారు. ఆదివారం జరిగిన బార్ అసోసియేషన్ సమావేశంలో నిందితుల తరఫున ఏ న్యాయవాది వాదించకూడదని నిర్ణయం తీసుకున్నారు.

కావలి కేంద్రంగా నిందితుల నేరాలు

కావలిని కేంద్రంగా చేసుకుని నిందితులు నకిలీ నోట్లు, దొంగ బంగారం, రద్దు అయిన నోట్ల మార్పిడితోపాటు మోసాలు, దౌర్జన్యాలు, రౌడీయిజం, దందాలు చేస్తున్నారు. నిందితులపై ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. దొరకకుండా తప్పించుకుని తిరుగుతున్న నిందితులను కొంతకాలంగా పోలీసులు సైతం పట్టించుకోకుండా వదిలేశారు. ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి ఘటనతో నిందితుల అరాచకాలపై రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత వ్యక్తం కావడంతో జిల్లా ఎస్పీ సీరియస్‌గా తీసుకున్నారు. నిందితులపై ఇప్పటికే ఉన్న కేసులను పోలీసులు బయటకు తీసి ఉచ్చు బిగిస్తున్నారు. టీడీపీ, జనసేన నాయకులతో సంబంధాలు ఉన్న ఈ గ్యాంగ్ ఆ పార్టీ నాయకులతో టచ్‌తో ఉండి ఈ కేసు నుంచి బయట పడడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

క్లుప్తంగా

మాతృభూమిపై సతీష్‌రెడ్డి మమకారం గర్వకారణం

• ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న తిరుమలేశ్వరరెడ్డి

ఆత్మకూరు రూరల్: తాను పుట్టి పెరిగిన ఆత్మకూరు మండలం మహిమలూరుపై భారత రక్షణ శాఖ సలహాదారు, డీఆర్డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డికి ఉన్న మమకారం ప్రతి ఒక్కరికీ గర్వకారణమని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి పేర్కొన్నారు. చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో మహిమలూరులో వారం పాటు నిర్వహించనున్న ఉచిత నేత్ర శిబిరాన్ని సతీష్‌రెడ్డితో కలిసి ఆదివారం ప్రారంభించిన అనంతరం ఎస్పీ మాట్లాడారు. మెగా కంటి వైద్యశిబిరాన్ని మహిమలూరులో శంకర నేత్రాలయ వారు గతేడాది నిర్వహించారని, సతీష్‌రెడ్డిపై అభిమానంతో మరోసారి ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. అనంతరం సతీష్‌రెడ్డి మాట్లాడారు. మహిమలూరు అభివృద్ధి కోసం తాను యత్నిస్తూనే ఉంటానన్నారు. ఆత్మకూరు, మర్రిపాడు, అనంతసాగరం తదితర మండలాల ప్రజలు నేత్ర శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం శంకర నేత్రాలయ నిపుణుడు అరుశ్ కుమార్ నేతృత్వంలో దాదాపు 135 మందికి వైద్య పరీక్షలు చేశారు. సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచి పరమేశ్వరరెడ్డి, సతీష్‌రెడ్డి సోదరుడు శ్రీనివాసులురెడ్డి, బీజేపీ నేత కుడుముల సుధాకర్‌రెడ్డి, సింహపురి ఆస్పత్రి రవీంద్రరెడ్డి, డీఆర్డీఓ ఉద్యోగి శ్రీనివాసులు, సర్పంచ్ పట్టెడ చంద్రశేఖర్, రామస్వామిపల్లి మాజీ సర్పంచ్ యర్రంరెడ్డి నాగమోహన్‌రెడ్డి, నిజమాల నరసింహులు, మద్దినేని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌పై కఠిన చర్యలు



సైదాపురం: ఖనిజ సంపదను అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు చేపట్టనున్నామని జిల్లా మైనింగ్ అధికారి శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు సైదాపురంలో విలేకరులతో ఆదివారం ఆయన మాట్లాడారు. మండలంలో అక్రమ తవ్వకాలను అరికట్టేందుకు గానూ ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని వివరించారు. సమాచారం అందిన వెంటనే తనిఖీలు చేపట్టి వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నామని చెప్పారు. అధిక బరువుతో చెన్నైకు ఖనిజాన్ని తరలిస్తున్న నాలుగు లారీలను సీజ్ చేసి పోలీసులకు అప్పగించామన్నారు. విజిలెన్స్ ఏడీ బాలాజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	: రూ.130
లేయర్	: రూ.113
బ్రాయిలర్ చికెన్	: రూ.226
స్కిన్‌లెస్ చికెన్	: రూ.250
లేయర్ చికెన్	: రూ.192

నిమ్మ ధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ. 65
సన్నవి	: రూ. 30
పండ్లు	: రూ. 7

సై అంటున్న స్క్వే జట్టు

• జాతీయ క్రీడల్లో తొలిసారి ప్రాతినిధ్యం
• శాప్ ఆధ్వర్యంలో నెల్లూరులో శిక్షణ శిబిరం



సాధన చేస్తున్న క్రీడాకారులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): జాతీయ సంప్రదాయ యుద్ధక్రీడలకు ప్రాధాన్యం నానాటికీ పెరుగుతోంది. ఇదే కోవకు చెందిన మార్షల్ ఆర్ట్స్ క్రీడ స్క్వేకు దేశవ్యాప్తంగా ఆదరణ లభిస్తోంది. రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఈ క్రీడ దినదినాభివృద్ధి చెందుతోంది. 1985లో కశ్మీర్‌లో ఈ క్రీడను మొదటిసారి ఆడారు. రాష్ట్ర క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటూ వచ్చారు. స్క్వే మార్షల్ ఆర్ట్స్‌ను ఈ ఏడాది అధికారికంగా రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ గుర్తించింది.

నెల్లూరులో శిక్షణ

గోవాలో నిర్వహిస్తున్న 37వ జాతీయ క్రీడాపోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తన ప్రతిభను ప్రదర్శించనుంది. ఈ క్రమంలో రాష్ట్ర జట్టుకు శిక్షణ శిబిరాన్ని నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన శిబిరం సోమవారంతో ముగియనుంది. ఈ శిక్షణతో క్రీడాకారులు మరింత ఉత్సాహంతో పోటీల్లో పాల్గొననున్నారు.

జట్టు ఇలా..

➡ బాలుర విభాగంలో విజయనగరం, అన్నమయ్య జిల్లా నుంచి ఇద్దరు చొప్పున, విశాఖపట్నం, ఏలూరు, కర్నూలు, పల్నాడు జిల్లాల నుంచి ఒకరు చొప్పున శిక్షణ పొందుతున్నారు.

➡ బాలికల విభాగంలో విజయనగరం నుంచి ముగ్గురు, అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి ఇద్దరు, నెల్లూరు, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల నుంచి ఒకరు చొప్పున శిక్షణ పొందుతున్నారు. గోవాలో నవంబర్ ఒకటి నుంచి ప్రారంభంకానున్న స్క్వే పోటీల్లో రాష్ట్ర జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. కోచ్‌గా స్క్వే అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఇబ్రహీం, మేనేజర్‌గా ఇస్మాయిల్ వ్యవహరించనున్నారు.

పతకాలు సాధిస్తామని నమ్మకం



జాతీయ పోటీల్లో మొదటిసారిగా పాల్గొంటున్నా, రాష్ట్ర జట్టు పతకాలను సాధిస్తాయని నమ్మకం. శిక్షణ శిబిరంలో క్రీడాకారులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పించాం. క్రీడాకారులకు టీఏ, డీఏలు, క్రీడా దుస్తులను అందజేయడం హర్షణీయం. ప్రభుత్వ ప్రోత్సాహంతో రానున్న రోజుల్లో స్క్వే మరింత అభివృద్ధి చెందుతుంది.

– ఇబ్రహీం, కోచ్, ప్రధాన కార్యదర్శి, స్క్వే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్ర అసోసియేషన్

అంతర్జాతీయ స్థాయిలో పాల్గొన్నా..



నేపాల్‌లోని ఖాట్మాండులో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన స్క్వే మార్షల్ ఆర్ట్స్ అంతర్జాతీయ పోటీల్లో పాల్గొన్నా. ఈ యుద్ధ క్రీడ బాలికలకు ఎంతో ఉపయోగపడుతుంది. మొట్టమొదటిసారిగా జాతీయ క్రీడల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

– సత్యశ్రీ, అంబేడ్కర్ కోనసీమ జిల్లా

ప్రోత్సాహాన్ని అందిస్తే సత్తా చాటుతా



ఆర్థికంగా మా కుటుంబం చాలా ఇబ్బందులు పడుతోంది. అయినా మార్షల్ ఆర్ట్స్‌లో 15 ఏళ్లుగా రాణిస్తున్నా. మెడల్స్ సాధించి ప్రభుత్వోద్యోగంతో కుటుంబానికి అండగా నిలిచి క్రీడాకారులకు సాయం అందిస్తా.

– పోతిన ప్రవీణ్, విశాఖపట్నం

పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించడమే లక్ష్యం



స్క్వేలో రాణించి పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాలనేదే ధ్యేయం. కోచ్ త్రినాథరావు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఈ స్థాయికి వచ్చా. మరిన్ని టోర్నీల్లో రాణించి దేశానికి మంచిపేరు తెస్తా.

– లలిత కామేశ్వరి, విజయనగరం

ఉన్నతోద్యోగ సాధనే ధ్యేయం



బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశా. రైల్వేల్లో అవుట్‌సోర్సింగ్‌లో నెట్‌వర్క్ ఇంజినీరింగ్ ఉద్యోగాన్ని వదిలి స్క్వే సాధన చేస్తున్నా. ఖాట్మాండులో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నా. స్క్వేలో రాణించి ఉన్నతోద్యోగాన్ని సాధిస్తాననే నమ్మకం ఉంది.

– ఆంజనేయప్రసాద్, విజయనగరం

పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను జనంలోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రతి ఒక్కరికీ వివరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వాకాడులో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, పార్టీ శ్రేణులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వై ఏపీ నీడ్స్ జగన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నవంబర్ తొమ్మిది నుంచి నిర్వహించనున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ప్రతి ఇంటికీ వెళ్లి తెలియజేయాలని కోరారు. సంబంధిత సామగ్రిని పార్టీ మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డి ద్వారా అందించనున్నామని వెల్లడించారు. నేతలు కొడవలూరు దామోదర్‌రెడ్డి, రౌతు రామకృష్ణ, వాకాటి నాగభూషణమ్మ, వెంకటరత్నమ్మ, ఏనుగు సుధాకర్‌నాయుడు, కోటేశ్వరరెడ్డి, అజిత్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణయ్య, జనార్దన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లికెళ్లొస్తూ అనంతలోకాలకు..

• వ్యక్తి మృతి, ముగ్గురికి గాయాలు



ఘటన స్థలంలో మృతదేహం

ఆత్మకూరు రూరల్: పెళ్లికి హాజరై తిరిగొస్తుండగా, రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన 67వ నంబర్ జాతీయ రహదారిపై కొండమీద కొండూరు బస్‌షెల్టర్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు.. బళ్లారిలో నివాసం ఉంటున్న బైనా సుమన్ (49), తన భార్య, కుమారుడు, కుమార్తెతో కలిసి బంధువుల వివాహ నిమిత్తం స్వగ్రామమైన కొడవలూరు మండలం యల్లాయపాళేనికి వచ్చారు. అనంతరం తిరిగి బయల్దేరగా, కొండమీద కొండూరు బస్‌షెల్టర్ సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారు కుడివైపు టైర్ పంక్చరై పగిలిపోయింది. దీంతో వాహనం అదుపుతప్పి ఎదురుగా ఉన్న నిద్రగన్నేరు చెట్టును బలంగా ఢీకొని పక్కనే ఉన్న పొలంలోకి దూసుకెళ్లింది. ఘటనలో సుమన్ అక్కడికక్కడే మరణించగా.. భార్య, కుమారుడు, కుమార్తె గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఆత్మకూరు సీఐ వేణు, ఎస్సై ముత్యాలరావు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటికి తీసి వైద్య చికిత్స నిమిత్తం ఆత్మకూరు జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘చందన, సీఎమ్మార్’లో వీక్లీ డ్రా



అధినేత మావూరి వెంకటగణేష్, విశ్రాంత హెల్త్ ఆఫీసర్ శివ నాగేశ్వరరావు, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): దసరా, దీపావళి వైభవాల ద్వారా చందన, సీఎమ్మార్ నిర్వహిస్తున్న నాలుగో వీక్లీ హీరో బైక్ డ్రాను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం తీశారు. కావలికి చెందిన సుధ (కూపన్ నంబర్ 73433)ను హీరో బైక్ విజేతగా ప్రకటించారు. గత వారం డైలీ డ్రా విజేతలు 35 మందికి గ్రైండర్, మిక్సీ, కుక్కర్, ఇండక్షన్ స్టౌ, కడాయి సెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పండగల సందర్భంగా విలువైన గృహోపకరణాలు, బైక్‌లు, కార్లను వినియోగదారులకు అందజేసి వారి ఇళ్లలో సంతోష సంబరాలను నింపడాన్ని అభినందించారు. రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, సీఎమ్మార్ అధినేత మావూరి వెంకటగణేష్, విశ్రాంత హెల్త్ ఆఫీసర్ శివ నాగేశ్వరరావు, మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య

• మృతుడు అల్లూరు మండలం నార్త్ ఆములూరు వాసిగా గుర్తింపు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



వెంకటేశ్వర్లు (ఫైల్)

కందుకూరు: పట్టణ శివారు ప్రాంతంలో వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన ఆదివారం ఉదయం వెలుగులోకి వచ్చింది. మృతుడి బంధువులు, పోలీసుల వివరాల మేరకు.. అల్లూరు మండలం నార్త్ ఆములూరుకు చెందిన చినవెంకయ్య, లీలమ్మ కుమారుడు వెంకటేశ్వర్లు (38) ముఠా మేస్త్రి. కందుకూరు మండలం మాచవరానికి చెందిన విజయలక్ష్మితో 2004లో వివాహమైంది. కందుకూరులోని కేసరిగుంటకాలనీలో ఐదేళ్లుగా వీరు నివాసం ఉంటున్నారు. ముఠా పనులు, బేల్దారి పనులకు వెంకటేశ్వర్లు వెళ్తుంటారు. మహదేవపురానికి చెందిన బేల్దారి మేస్త్రి కల్యాణ్‌తో వెంకటేశ్వర్లుకు చాలా కాలంగా పరిచయముంది. కల్యాణ్ ఫోన్ చేయడంతో ఇంటి నుంచి వెంకటేశ్వర్లు శనివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో బయటకొచ్చారు. ఆ తర్వాత ఏమి జరిగిందో తెలియదు గానీ తెల్లారేసరికి మాచవరం రోడ్డులోని పెట్రోల్ బంక్ ఎదురుగా గల సెల్‌టవర్ వద్ద నిర్మానుష్య ప్రాంతంలో శవమై తేలారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని మృతదేహం, పరిసర ప్రాంతాలను పరిశీలించి హత్యగా పోలీసులు నిర్ధారణకు వచ్చారు. వెంకటేశ్వర్లు తలపై పెద్ద బండతో దాడి చేసినట్లు ఉంది. రక్తంతో బండ తడిసి పక్కనే పడి ఉంది. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లతో ఆధారాలను సేకరించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ రామచంద్ర, సీఐ నఫీజ్‌బాషా పరిశీలించారు. వెంకటేశ్వర్లు భార్య, బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడున్నారు.

వరికుంటపాడులో చోరీ

వరికుంటపాడు: మండలంలోని విరువూరులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రమణారెడ్డి, రాధమ్మ దంపతులు ఇంటి వద్దే దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాను పగలగొట్టి అందులో ఉన్న రూ.లక్ష నగదు, దిండు కింద ఉంచిన దుకాణ తాళాలను తీసి అందులోని రూ.10 వేలను చోరీ చేశారు. అక్కడే ఉన్న పెట్రోల్‌ను వారి వాహనాల్లో పోసుకొని బాటిళ్లను వదిలివెళ్లారు. బీరువా, దుకాణ తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన బాధితులు చోరీ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చోరీ తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కబడ్డీ, చెస్ పోటీలు

ఆత్మకూరు రూరల్: విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో కబడ్డీ, చెస్ పోటీలను పట్టణంలోని ఎస్సార్డీ డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో సోమ, మంగళవారాల్లో నిర్వహించనున్నామని వ్యాయామ అధ్యాపకుడు, ఆర్గనైజింగ్ సెక్రటరి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది గంటలకు నిర్వహించనున్న ప్రారంభ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరుకానున్నారని చెప్పారు.

ఏటీఎంలో నగదు చోరీకి యత్నం



ధ్వంసమైన ఏటీఎం

ఉదయగిరి: ఏటీఎంను ధ్వంసం చేసి నగదును కొల్లగొట్టేందుకు యత్నించిన ఘటన మండలంలోని గండిపాళెం బస్టాండ్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. బస్టాండ్ సెంటర్‌లోని ఓ దుకాణ సముదాయంలో ఇండియా – 1 ఏటీఎంను సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు ఏటీఎంలోకి ప్రవేశించారు. నగదును అపహరించాలనే ఉద్దేశంతో వారి వెంట తెచ్చుకున్న యంత్రాలతో మెషీన్‌ను ధ్వంసం చేశారు. నగదు పెట్టె ప్రదేశాన్ని తెరిచేందుకు విఫలయత్నం చేసి చివరికి వెనుదిరిగారు. ఏటీఎంలో నగదును తీసుకునేందుకు గానూ ఆదివారం వెళ్లిన ఓ వ్యక్తి విషయాన్ని గమనించి భవన యజమానికి తెలియజేశారు. ఆయన పరిశీలించి నిర్వాహకులకు సమాచారం అందించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటన స్థలానికి ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలిసి చేరుకొని వివరాలను ఆరాతీశారు. వేలిముద్రలను క్లూస్‌టీమ్ సేకరించింది. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ పట్టివేత



సైదాపురం: గులించెర్ల అటవీ ప్రాంతం నుంచి తెల్లరాయిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం స్వాధీనం చేసుకున్నామని నెల్లూరు రేంజర్ మాల్యాద్రి తెలిపారు. అడవి నుంచి ట్రాక్టర్ ద్వారా నిత్యం తెల్లరాయిని తరలిస్తున్నారనే సమాచారం అందడంతో తనిఖీలు చేపట్టామన్నారు. ఈ క్రమంలో గులించెర్లకు చెందిన టీడీపీ నేత ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అటవీ ప్రాంతం నుంచి ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది అమీనయ్య, రవిశేఖర్, విజయ్‌కుమార్, గిరిజాకుమారి పాల్గొన్నారు.